క్లుప్తంగా

రైతుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే చెప్పండి



వెంకటాపురం(మోపిదేవి): రైతులు పండిస్తున్న సాగు వివరాలను సామాజిక తనిఖీ కొరకు రైతు సేవా కేంద్రాల్లో పొందుపర్చినట్లు మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి తెలిపారు. మండలంలోని వెంకటాపురం, పెదకళ్లేపల్లి ఆర్‌బీకేలలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపురంలో ఏవో మాట్లాడుతూ రైతుల సమాచారం ముసాయిదా జాబితాను ఆయా రైతు సేవా కేంద్రాల్లోని నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 16వ తేదీ లోపు రైతులు అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా సమస్యలు పరిష్కరించిన అనంతరం 18వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామన్నారు. తుది జాబితా ఆధారంగా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందని ఏవో వివరించారు.

కాలేజీల్లో మధ్యాహ్నభోజన పథకం అమలు చేయాలి

– ఏఐఎస్ఎఫ్ డిమాండ్

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని పునఃప్రారంభించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మోదుమూడి శ్రీహరిరావు భవన్‌లో మంగళవారం ఆ సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అమలు చేయాలన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే ప్రభుత్వ కళాశాలల్లో చదువుతారని, వారికి మధ్యాహ్నభోజనం అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా కన్వీనర్ సాదిక్‌బాబు, కార్తీక్, నాని, సంతోష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 20 మంది తరలింపు



పెడన: కంటి ఆపరేషన్ల నిర్వహణకు 20 మందిని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించినట్లు సహాయ ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్‌బాషా మంగళవారం తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న పెడనలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన 20 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఆశ్రం నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో పంపించామని, వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించడమే కాకుండా ఉన్నన్ని రోజులు ఉచితంగా భోజనం కల్పిస్తారని తెలిపారు. అవసరమైన 60 మందికి కూడా కళ్లజోళ్లను అందజేశామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి ప్రసాద్, అంకాల రామకృష్ణ, తూము రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక ఫలసాయం

గూడూరు: సేంద్రియ ఎరువులతో అధిక ఫలసాయం పొందవచ్చని ఎంఏవో శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కప్పలదొడ్డి, లేళ్లగరువు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సొంతంగా సేంద్రియ ఎరువులు తయారు చేసుకొని అవసరమైనపుడు వాడుకునే విధంగా సన్నద్ధం కావాలన్నారు. జీవామృతం పది కిలోల పశువుల పేడ, 10 లీటర్ల పశువుల మూత్రం, బెల్లం కిలో, శనగపిండి కిలో, నీరు 200 లీటర్లు, పుట్టమన్ను మోతాదుగా తీసుకుని ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో వీటన్నిటినీ కలిపి వారం రోజులు పులియాబెడుతూ తర్వాత సాగునీటి ద్వారా వాడుకోవాలని సూచించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

37 చెత్త తరలింపు వాహనాల నిలిపివేత

ఆయిల్ లేకపోవడమే కారణం

మచిలీపట్నంటౌన్: ఆయిల్ కొరతతో నగరంలో 37 చెత్త తరలింపు వాహనాలు మంగళవారం నిలిచిపోయాయి. నగరంలో మొత్తం 41 చెత్త తరలింపు వాహనాలు ఉండగా ఆయిల్ కొరతతో సోమవారం 24 వాహనాలు డిపోకే పరిమితం కాగా మంగళవారం ఇది 37కు చేరింది. కేవలం నాలుగు వాహనాలు మాత్రమే ఉన్న ఆయిల్‌తో చెత్తను తరలించాయి. బుధవారం ఇవి కూడా నిలిచిపోనున్నాయి. క్లాప్ పథకం ద్వారా నగరంలో పనిచేస్తున్న వాహనాలకు ఆయిల్ కొట్టించేందుకు సంబంధిత కాంట్రాక్టర్ చేతులెత్తేయటంతో ఈ సమస్య తలెత్తింది. కాంట్రాక్టర్‌కు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవటంతోనే ఈ సమస్య ఎదురైందనే వాదనలు వినవస్తున్నాయి. వాహనాలు నిలిచిపోవటంతో నగరంలోని చెత్త ఎక్కడిదిఅక్కడే పేరుకుపోతోంది.

ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్ష

- పీహెచ్‌సీలో రెండు డాక్టర్ పోస్టులు ఖాళీ
- రెండు నెలల క్రితం బదిలీపై వెళ్లిన ఇద్దరు వైద్యులు
- రోగులకు పూర్తిస్థాయిలో అందని వైద్యసేవలు
- రాత్రి వేళల్లో వైద్యసేవలు నామమాత్రమే



కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కోడూరు: దివిసీమలో సముద్రతీరానికి అతీ సమీపంలో ఉన్న కోడూరు మండల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్ పోస్టులు రెండు ఖాళీగా ఉండటంతో సరైన వైద్యం అందక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ ప్రాంతలో పాము కాట్లు ఎక్కువ. కుక్క కాటు వ్యాక్సిన్లు వేయించుకొనేందుకు కూడా ప్రజలు ఈ పీహెచ్‌సీకే తరలివస్తారు. అయితే వైద్యులు లేని కారణంగా ప్రభుత్వ వైద్యం అందని పండుగా మారింది.

పరిస్థితి ఇదీ..

మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి కోడూరు, మందపాకల గ్రామాల్లో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించారు. ఈ రెండు పీహెచ్‌సీల ద్వారా మండలంలోని సుమారు 50 వేల మంది ప్రజలు వైద్యసేవలు పొందాల్సి ఉంది. కోడూరు పీహెచ్‌సీ మండల కేంద్రానికి అతి సమీపంలో ఉండడంతో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. తీరప్రాంత గ్రామాలైన హంసలదీవి, పాలకాయతిప్ప, ఉల్లిపాలెం, కోడూరు ప్రజలు నిత్యం వివిధ ఆరోగ్య సమస్యలపై పీహెచ్‌సీకి వచ్చి వైద్యసేవలు పొందుతారు.

రెండు నెలల క్రితం ఇద్దరు డాక్టర్ల బదిలీ..

కోడూరు వైద్యశాలలో నిత్యం 90 నుంచి 110మంది వరకు ఓపీ చూపించుకుంటారు. పీహెచ్‌సీలో రెండు వైద్యాధికారుల పోస్టులు ఉన్నాయి. రెండు నెలల క్రితం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులిద్దరూ ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు మందపాకల పీహెచ్‌సీకి చెందిన ఒక వైద్యాధికారిని ఇక్కడ డిప్యూటేషన్ వేశారు. ప్రస్తుతం ఈ వైద్యాధికారి ఉదయం నుంచి సాయంత్రం వరకు కోడూరు పీహెచ్‌సీలో ఉంటూ రోగులకు వైద్యసేవలందిస్తున్నారు.

గతంలో నలుగురు వైద్యుల సేవలు..

గత ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తే ప్రస్తుత ప్రభుత్వం నలుగురిలో ఇద్దరు వైద్యులను బదిలీ చేసింది. మందపాకల, కోడూరు పీహెచ్‌సీలకు నాలుగు వైద్యాధికారుల పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం కోడూరు పీహెచ్‌సీకి మందపాకల నుంచి ఒక వైద్యాధికారి డెప్యూటేషన్‌పై రావడంతో ఆ పీహెచ్‌సీలో కూడా ఒక వైద్యాధికారి మాత్రమే ఉన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ రెండు పీహెచ్‌సీలో నలుగురు వైద్యాధికారులు ఉండడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందాయి. ప్రస్తుతం ఇద్దరు వైద్యాధికారుల పోస్టుల ఖాళీ ఉండడంతో రెండు పీహెచ్‌సీల్లో సమస్య మొదలైంది.

రాత్రి వేళల్లో ఒక స్టాఫ్ నర్స్ మాత్రమే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మందపాకల, కోడూరు పీహెచ్‌సీల్లో 24 గంటల వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాత్రి వేళల్లో ప్రజలకు అత్యవసర వైద్యసేవలను కూడా అందించారు. ప్రస్తుతం వైద్యాధికారుల కొరతతో రాత్రి సమయంలో కేవలం ఒక స్టాఫ్ నర్స్ మాత్రమే వైద్యశాలలో ఉంటున్నారు. స్టాఫ్ నర్స్ అత్యవసర సేవలను చేయకుండా అవనిగడ్డకు రిఫర్ చేస్తున్నట్లు రోగులు చెప్పుతున్నారు.

పోస్టులు భర్తీ చేయాలి



కోడూరు పీహెచ్‌సీలో రెండు వైద్యుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. మందపాకల వైద్యాధికారిని ఇక్కడ డెప్యూటేషన్‌పై వేశారు. ఇలా వేయడం వల్ల మందపాకల, కోడూరు రెండు పీహెచ్‌సీల్లో ప్రజలకు వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. రాత్రి వేళల్లో కేవలం స్టాఫ్ నర్స్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు రెండు వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి.

–యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు, కోడూరు

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది



కోడూరు పీహెచ్‌సీలో రెండు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడంతో నన్ను మందపాకల పీహెచ్‌సీ నుంచి డెప్యూటేషన్‌పై ఇక్కడకు నెల రోజుల క్రితం పంపారు. పోస్టుల ఖాళీ విషయం ఉన్నతాధికారుల దగ్గర నివేదిక ఉంది. పీహెచ్‌సీలో స్వీపర్, నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి రోజు 90 మంది రోగులకు వైద్యసేవలందిస్తున్నాం.

– శిరీష, వైద్యాధికారి, మందపాకల (కోడూరు డెప్యూటేషన్)

పీఎం సూర్యఘర్ పథకం లక్ష్యం సాధించాలి

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి (మచిలీపట్నం): జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలులో నిర్ణీత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి పథకంపై విద్యుత్‌శాఖాధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలనే మంచి ఆలోచనతో రూ.78 వేల వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడి లక్ష్యాలను సాధించాలన్నారు. దీనిపై మూడు రోజులకోసారి సమీక్ష చేస్తానని నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నోడల్ అధికారి ఎం.భాస్కరరావు, ఎస్ఈ సత్యానందం, ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన యువకులు

చల్లపల్లి(అవనిగడ్డ): దసరా పండుగకు హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రక్తదానం చేశారు. పెడన గ్రామానికి చెందిన సుధాకర్ ప్రమాదంలో గాయపడి ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామానికి చెందిన నాగబాబు, దినేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ దసరా సెలవులకు వచ్చారు. మన అవనిగడ్డ బ్లడ్ డోనర్స్ గ్రూపు సభ్యులు కస్తూరి విజయ్ వీరికి సమాచారం ఇచ్చారు. స్పందించిన వీరు మచిలీపట్నం వెళ్లి ఓ పాజిటివ్ రక్తం ఇచ్చివచ్చారు. కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సింగవరపు బుజ్జిబాబుకి ఇటీవలె యాక్సిడెంట్ కాగా మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ సందీప్ సమాచారం మేర కు మోపి దేవి మండలం బొబ్బర్లంక గ్రామానికి చెందిన లింగం రాజశేఖర్ ఏబీ పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త కలాం

మచిలీపట్నంటౌన్: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. స్థానిక గొడుగుపేటలో నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, పీవీ ఫణికుమార్, నీరజ, హరికృష్ణ, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, ప్రసాదరావు, ప్రసాద్, ఎల్ఐసీ శర్మ పాల్గొన్నారు.

కృత్తివెన్ను: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజె అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మండలంలోని పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం కొప్పినేటి సూర్యప్రకాష్ ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇస్రోలో ఏరోస్పేస్ ఇంజినీర్‌గా, క్షిపణి శాస్త్రవేత్తగా, భారతమిసైల్‌మాన్‌గా పేరుగాంచిన ఆయన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు ఏసుబాబు, జె. రాజ్యలక్ష్మి, మురళీకృష్ణ, జి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: క్షిపణి పరిశోధన రంగంలో భారత దేశం గర్వించ దగిన గొప్ప శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జనసేన యువనేత మండలి వెంకట్రామ్, దివిసీమ లలిత కళాసమితి కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖరరావు, గురుస్వామి తుర్లపాటి రామ్మోహనరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబుతో పాటు పలువురు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మి నారాయణ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా దేశానికి కలాం అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రజమంలో మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ బాషా, పార్టీ నాయకులు చింతలపూడి బాలు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం

మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: విద్యార్థి దశ నుంచే పిల్లలకు దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలోని చిలకలపూడి పాండురంగ మునిసిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. ఎన్‌సీసీతో మాతృభూమికి సేవ చేసే అవకాశం దొరుకుతుందన్నారు. దేశ నాయకులుగా ఎదిగిన ఎంతో మంది ఎన్‌సీసీలో పనిచేశారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూవీ కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకుడు బండి రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ టి.కాశీవిశ్వనాథం, మాజీ కౌన్సిలర్ కొట్టే వెంకట్రావు, డీవైఈవో శేఖర్‌సింగ్, ఎంఈవోలు దుర్గాప్రసాద్, గురుప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ సతీష్, ఎన్‌సీసీ అధికారి ఎవీ రామాంజనేయులు, పీడీ రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం అక్షరాస్యత సాధించండి

డీఆర్వో చంద్రశేఖరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో నూరుశాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) కార్యక్రమం అమలుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె. చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని మంగళవారం ఆయన చాంబర్‌లో నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఈ కార్యక్రమం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేయబడుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల్లో లబ్ధిదారులు ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు తదితరులు నియో లిటరేట్స్ కొంత చదువు కలిగి ఉన్నప్పటికీ మరిచిపోయిన వారిని ఈ కార్యక్రమం ద్వారా గుర్తించి అక్షరాస్యత కల్పించటమే ముఖ్యఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని విస్తృతం చేసేందుకు జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లో విలేజ్ ఆర్గనైజేషన్ సహాయకులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లను, వలంటరీ టీచర్లుగా గుర్తించాలన్నారు. ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. వీరికి అక్టోబరు 25న రాష్ట్ర స్థాయి, 29న జిల్లాస్థాయి, నవంబరు 2న మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. నవంబరు 5 నుంచి 2025 మార్చి 15వ తేదీ వరకు వలంటరీ టీచర్స్ అక్షరాస్యత తరగతులు నిర్వహించటం జరుగుతుందన్నారు. జిల్లా వయోజన విద్య ఉపసంచాలకులు హాజీబేగ్, ఏపీవో ఎ.అజయ్‌కుమార్, డీవైఈవో శేఖర్‌సింగ్, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

‘పల్లెపండుగ’ పనులు సంక్రాంతి కల్లా పూర్తి

పెడన: పల్లెపండుగ వారోత్సవాలలో ప్రారంభించిన అభివృద్ధి పనులను 2025 సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన చిన నందమూరు, అచ్చయ్యవారిపాలెం, జింజేరు గ్రామాల్లోని పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్‌తో చేపడుతున్న పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలో రూ.21 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. పెడనలో సీసీ రోడ్లు, బరియల్ గ్రౌండ్స్‌లో షెడ్ల నిర్మాణం, పలు పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్ నిర్మాణం వంటి పనులను ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపడుతున్నామన్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. జనసేన మండల అధ్యక్షుడు పంచకర్ల సురేష్, జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, సర్పంచు నరసింహారావు, ఎంపీటీసీ బొల్లా ఉదయ్‌నాగకుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో జయరాం, పీఆర్ ఏఈ వై.ధర్మయ్య, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాల: నియోజకవర్గంలోని డ్రెయినేజీ, ఇరిగేషన్ పనులు రూ.5 కోట్ల 90 లక్షల 32 వేలతో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల పల్లె పండుగ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మేడూరు, పమిడిముక్కల, ఘంటసాలమండల పరిధిలోని అచ్చెంపాలెం, కొడాలి, దేవరకోట, ఘంటసాల గ్రామాల్లోని గుండేరు డ్రెయినేజీ బేసిన్ పరిధిలో మంజూరైన నిధుల వివరాలను వెల్లడించారు. పలు పనులకు శంకుస్థాపన చేశారు. సత్యసాయి మినీ కల్యాణ మండపంలో మాట్లాడారు.

కోనేరుసెంటర్: బందరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అందుకోసం సుమారు రూ.30 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సదరు నిధులతో రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. బందరు మండలం తాళ్ళపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రూ.38 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. జనసేన నాయకుడు బండి రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపీచంద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, తలారి సోమశేఖర్, స్థానిక నాయకుడు లంకే శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

అభ్యసన రుగ్మతలపై అవగాహన

కృత్తివెన్ను: అభ్యాస రుగ్మత (డైస్లెక్సియా) అనేది మొదడు క్రమరాహిత్యాన్ని సరిదిద్దడానికి ప్రత్యేకమైన మందులు లేవని, చిన్న వయస్సులోనే ఈ లోపాన్ని గుర్తించి సరైన శిక్షణ ఇవ్వడం వల్ల అవగాహనాస్థాయిని పెంచవచ్చని ఎంఈవో ప్రసాద్ అన్నారు. మంగళవారం నీలిపూడి భవిత కేంద్రంలో డైస్లెక్సియా అవగాహన మాసాన్ని పురస్కరించుకుని సదస్సు, రెండు కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోపం ఉన్న వారు తెలియని పదాలు చదవడం, రాయడంలో ఇబ్బందులు పడతారన్నారు. దీనిపై ఐఈపీఆర్ వరుణ్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు శంకరరావు, సీఆర్‌పీ తంబిబాబు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

గూడూరు: మండల భవిత కేంద్రం ఆధ్వర్యంలో డిస్లెక్సియా అవగాహన ర్యాలీని మంగళవారం గ్రామంలో నిర్వహించారు. ఎంఈవో–2 పి.సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ ర్యాలీ గ్రామంలోని పలు ప్రధాన అంతర్గత రహదారుల వెంబడి కొనసాగింది. కాంప్లెక్స చైర్మన్ పుష్పలత, షేక్ ఆలీ, పి.పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటేశ్వరమ్మ, ఐఈఆర్పీ పి.రమాదేవి, సజనీబేగం, దుర్గాప్రసాద్, కె.ప్రసన్న, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెడన: తరగతి గదుల్లో చదువుకుంటున్న విద్యార్థులలో చదవడం, రాయడం వంటి వాటితో ఇబ్బంది పడుతూ డిస్లెక్సియాతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిలో ప్రతిభను వెలికి తీసి ప్రొత్సహించాలని ఎంఈవో–2 వై.హరనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక బంగ్లాస్కూలులో డిస్లెక్సియా–అభ్యసన వైకల్యంపై ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం.షణ్ముఖరావు, ఐఈఆర్పీ రమ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్లో డిస్లెక్సియా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–1 ఎన్.శివశంకరరావు, సహిత విద్య రిసోర్స్ పర్సన్ జి.శ్రీకాంత్, శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎ.అనుపల్లవి భువనేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్లు వాహనాల పార్కింగ్ వద్ద నుంచి వేరే చోట ఏర్పాటు చేయాలని కోరారు. పురుష ఉద్యోగుల మరుగు దొడ్లు, దారి బాగోలేదని మరమ్మతులు చేయించాలని కోరారు. కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు ఏర్పాటు చేయాలని, కుర్చీలు, బల్లలు, బీరువాలు అవసరమైన మేర ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సెక్షన్‌లోనూ ఆర్వో వాటర్ పెట్టించాలని, పాత రికార్డులను రికార్డు రూమ్‌కు పంపేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి సెక్షన్‌లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, మహిళలకు వెయిటింగ్‌రూమ్‌లు ఏర్పాటు చేయా లని కోరారు. స్పందించిన కమిషనర్ బాపిరాజు ఈ పనుల అంచనాలు రూపొందించి, చేయించాలని మునిసిపల్ ఇంజినీర్‌ను ఆదేశించారు. డస్ట్‌బిన్లు, పాత రికార్డులను రికార్డు రూమ్‌కు పంపాలని మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వి.సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మోహన్‌గోపాల్, కార్పొరేషన్ యూనిట్ అధ్యక్షుడు బీవీ కళ్యాణ్, ఉపాధ్యక్షురాలు బీఎస్‌వీ లక్ష్మి ఉన్నారు.



కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కార్యాలయ ఉద్యోగులు


జనావాస ప్రాంతంలో మద్యంషాపు వద్దు

ఘంటసాల: స్థానిక సంత మార్కెట్ వెనుక మద్యం షాపును ఏర్పాటు చేయవద్దంటూ ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డికి మంగళవారం రాత్రి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు దేవాలయాలు, జనావాసాలకు 100 మీటర్ల పరిధి తర్వాత మద్యం షాపులకు అనుమతులు ఇస్తామని చెప్పారని, కానీ ఘంటసాలలో మాత్రం మద్యం షాపు పెట్టే 100 మీటర్ల లోపే వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయం, పోలేరమ్మ దేవాలయం, సమీపంలోనే చర్చి, విద్యార్థుల ప్రైవేటు ఉండటంతో పాటు ఇళ్లల్లో ప్రజలతో జనావాసాలు ఉన్నాయన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో రాంబాబు, ఉపాధ్యాయులు వేణు, నాంచారమ్మ, అమృతం, భూలక్ష్మి, సుబ్బమ్మ, కవి త, రమణ, వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

జీవో 1214 రద్దు చేయాలి

అవనిగడ్డ: గతంలో తీసుకొచ్చిన జీవో 1214 రద్దు చేయడంతో పాటు సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఉచిత ఇసుక పంపిణీలో దళారుల జోక్యం అరికట్టాలని, గతంలో తరలించిన రూ.1,281 కోట్లను వెంటనే సంక్షేమ బోర్డుకి జమ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కార్డులు, క్లెయిమ్‌లు ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. యూనియన్ జిల్లా నాయకులు యాసం శ్రీనివాసరావు, అధ్యక్షుడు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, ముత్యాల రామకృష్ణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



కోనేరుసెంటర్: హోంగార్డు విభాగంలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన కె.రాజారావుకు జిల్లాలోని హోంగార్డులంతా కలిసి ఒక రోజు కాంట్రిబ్యూషన్ కింద సేకరించిన నగదును చెక్కు రూపంలో మంగళవారం జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు చేతులమీదుగా అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో హోంగార్డుల ఐక్యత అభినందనీయమన్నారు. జిల్లాలోని హోంగార్డులంతా కలిసి రాజారావు కుటుంబానికి రూ.4,11,370లను అందజేయటం గర్తించాల్సిన విషయమన్నారు. రాజారావు కుటుంబానికి హోంగార్డ్స్ విభాగం తరపున అందాల్సిన ప్రయోజనాలు ఉంటే వీలైనంత త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎప్పుడు ఎటువంటి సహాయం కావాలన్నా అధికారులను కలవవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్‌రిజర్వు అధికారులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు మవాతిక షిటోరియో కరాటే ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచారని పాఠశాల డైరెక్టర్ కే.కిషోర్ తెలిపారు. ఈ నెల 6వ తేదీన చెన్నైలోని ఇంటిగ్రిల్ కోచ్ ఫ్యాక్టరీ హయ్యర్ సెంకడరీ పాఠశాల ఇండోర్ స్టేడియంలో ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించారు. పాఠశాల నుంచి ఈ పోటీల్లో 14, 10 సంవత్సరాల కాటా విభాగంలో టీ లాస్య, పి.యోషితలు ప్రథమ స్థానం సాధించారు. అలాగే 11, 9, 8 సంవత్సరాల కాటా విభాగంలో ఏ.విష్ణు, కే.హర్షిణి, కేఎస్.వైష్ణవ్ తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. విజేతలకు నిర్వాహకులు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విజేతలను, కోచ్ వెంకటేశ్వరరావును పాఠశాల డైరెక్టర్ కే.కిషోర్, హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, తల్లిదండ్రులు అభినందించారు.



రైతు బజారులో రూ.10 నాణేల పంపిణీ

మచిలీపట్నంటౌన్: స్థానిక రైతుబజారులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు రైతులకు రూ.10 నాణేలను మంగళవారం అందజేశారు. నగరంలోని ఐదు యూనియన్ బ్యాంక్ శాఖల మేనేజర్లు, రీజినల్ ఆఫీస్ బృందం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు నాణేలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు రైతు బజారులోని రైతులకు రూ.10 నాణేలను అందజేశామన్నారు. రూ.10 నాణేలను ప్రతి ఒక్కరూ వినియోగించాలని, తీసుకోనని చెప్పే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చన్నారు. రూ.10 నాణేలను వినియోగించేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రైతుబజారులో రూ.25 వేల పది రూపాయల నాణేలను అందజేశారు. యూబీ డెప్యూటీ రీజినల్ హెడ్ రామలింగారెడ్డి, రీజినల్ ఆఫీస్ ఆపరేషన్స్ సీనియర్ మేనేజర్ సురేష్, బ్రాంచ్‌ల మేనేజర్లు నవక్రాంత్, జయరాం, నందకిషోర్, సురేష్, కుమారస్వామి, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.